


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 22 పుష్పం : 45-47 5-8-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 22

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 03-01-04, ఏలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కలియుగంలో సమాజానికి ముఖ్యమైనది భక్తిమార్గము. మనం ఆచరించటానికి అనువైనది, తేలికైనది భక్తిమార్గము. మనం భక్తిని పోషించుకొంటూ ఉంటే ఇదే పక్వానికి వచ్చి పండుఅవుతుంది, ఆ పండే జ్ఞానము. భక్తి వలన జ్ఞానం వస్తుంది, జ్ఞానం వలన మోక్షం వస్తుంది. నరశింహస్వామి ప్రహ్లాదుడిని ఏదైనా కోరికలు కోరుకోమని అంటే కోరికలు క్రూరమృగాల వంటివి అన్నాడు ప్రహ్లాదుడు. మనకు ఈ జన్మ వచ్చింది మరల జన్మలు పెంచుకోవటానికి కాదు, జన్మలు లేకుండా చేసుకోవటానికి ఈ జన్మవచ్చింది. నేను చాలాకాలం నుండి సాధన చేస్తున్నాను ఫలితం ఏమీ కనబడటంలేదు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నువ్వు భగవంతుడి మీద మనస్సును లగ్నంచేయాలి. ఏదోచింతన లేకుండా మనస్సు ఉండదు. మనస్సు విషయచింతన చేస్తూ ఉంటే బంధం, భగవంతుడిని చింతిస్తూ ఉంటే మోక్షం కలుగుతుంది. విషయచింతన వలన బాహ్యప్రవృత్తి పెరుగుతుంది, జన్మలు పెరుగుతాయి. ఆత్మచింతన వలన మనలోని బలహీనతలు, లోపాలు అన్నీనశిస్తాయి, తరువాత ఆత్మదర్శనం అవుతుంది. అందుచేత విషయచింతనలో ఉన్న మన మనస్సును ఆత్మచింతనలోనికి మళ్ళించాలి, దానికి సత్పురుషుల సహవాసం, సద్గ్రంథపఠనం, ధర్మాన్ని ఆచరించటం, పెద్దలను సేవించటం ఇవిఅన్నీ అవసరం. సాధనచేస్తున్నాను అభివృద్ధి కనబడటం లేదు అంటే అభివృద్ధి

ఈ సంచికలో......

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

03-01-04 ఏలూరు ........ 1
12-02-04 సఖినేటిపల్లి ........ 6
15-07-04 జిన్నూరు ........ 9



Visit us @ www.srinannagaru.com

మనకు ఎలా తెలుస్తుంది, మన లెక్కలు కరెక్టుకాదు, మనం ఎంతవరకు అభివృద్ధి అయ్యాము అని చూసేవాడు మనలోపలే ఉన్నాడు, అది ఆయన చూసుకొంటాడు. మన అభివృద్ధికి ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, నాకు రోజూ భయం వేస్తోంది, ఆభయం తొలగే ఉపాయం చెప్పమని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భయం కూడా నిజం కాదు, అది కూడా ఒక తలంపే, గాఢనిద్రలో మనం ఎవరూ భయపడటంలేదు. గాఢనిద్రలో లేని భయం జాగ్రదవస్థలో ఎందుకువస్తోంది? గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే నేను అనే తలంపు వచ్చి మొదట దేహంతో తరువాత లోకంతో, విషయాలతో తాదాప్యం పొందటం వలన నీకు భయంవస్తోంది. దేహంతో తాదాప్యం లేనివాడికి, లోకంతో తాదాప్యం లేనివాడికి భయంలేదు, వాడు భయరహితుడు అవుతాడు. ఉన్నదేదో ఉంది, అది కొత్తగా కనిపెట్టేది ఏదీకాదు, అది మూడుఅవస్థలలోను ఉంది కాని అది మనకు అనుభవంలోనికి రాకుండా ఏది అడ్డువస్తోందో మనం గుర్తించాలి. గురువు ప్రతీజన్మలో మన కూడా ఉంటాడు. మనలోపల ఏ బలహీనతలు ఉన్నాయో చూపించి, వాటిని తొలగించుకోవటానికి మనకు సహకారం అందిస్తాడు, మనలోపల ఉన్న వాసనలను మన చేత కక్కింపచేస్తాడు. లోపల ఉన్న పసరు అంతా బయటకు పోవాలి కదా, పసరు బయటకుపోయేటప్పుడు ఎంతో కొంత బాధ ఉంటుంది. గురువు వాసనలలోనుండి మనలను విడిపించే ప్రక్రియలో కొంత బాధ ఉంటుంది, అనుభవిస్తే అదిపోతుంది. ప్రారబ్ధాన్ని సహనంతో అనుభవిస్తే అది నశిస్తుంది. మనం ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అతిగాతినకూడదు.

ఇప్పుడుమనకు మానవజన్మ వచ్చింది. ఈ అవకాశాన్ని మనం జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మానవజన్మ యొక్క విలువ మనకు తెలియటంలేదు. మానవత్వంలోనుండి దైవత్వంలోనికి వెళ్ళాలనే తలంపు మనకురావటంలేదు. మానవజన్మను వృధాచేసుకొంటున్నాము. మీపనులు మీరు శ్రద్ధగాచేసుకొంటూ, కాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఆత్మసాక్షాత్కారం పొందటానికి ఈ మానవజన్మను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. దేహప్రారబ్ధాన్ని బట్టి ఆదేహం నడుస్తూ ఉంటుంది. జయాపజయములు నీ తెలివిని బట్టి ఉండవు, దేహప్రారబ్ధాన్ని బట్టి ఉంటాయి, వాటిని సమానంగా తీసుకో, దానికి ట్రైనింగ్ పొందటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము, ఇది మనం నేర్చుకోవలసిందే, ఏకాగ్రత, పవిత్రత మనం అభివృద్ధి చేసుకోవాలి. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అని రమణమహర్షిగారిని అడిగితే మూలతలంపు మూలంలో భగవంతుడు ఉన్నాడు అని చెప్పారు. ఇప్పడు మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో అదే మొదటితలంపు, అదే దేహంతో తాదాప్యం పొందుతుంది, దానినే మూలతలంపు అంటారు. ఆ మూలతలంపు మూలంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు, చైతన్యం ఉంది. నువ్వు జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, విచారణ చెయ్యి, నీవు ఏది చేసినా మూలతలంపును దాని మూలంలోనికి

తీసుకొనివెళ్ళాలి. మూలతలంపును ఉపసంహరించి దాని మూలంలోనికి తీసుకొని వెళితే, అక్కడే చైతన్యం ఉంది, ఆ చైతన్య స్రవంతిలో ఐక్యమవుతావు. చైతన్యం యొక్క స్వరూపం ఆనందం, శాంతి, అదిస్వతంత్రమైనది, అప్పడు నీవు శాంతిలో ఆనందంలో ఊగిసలాడతావు. నీకు విచారణామార్గం ఇష్టంలేకపోతే, విచారణామార్గం చేసే అర్హత, యోగ్యత నీకు లేకపోతే నీవు కంగారుపడనక్కరలేదు, నీకు చాలా మార్గాలు ఉన్నాయి. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాత్మబుద్ధిలో నుండి విడుదలపొందాలి, అదే సాధన యొక్క లక్ష్యం. మనం కానిదానిని పోగొట్టుకొంటే ఉన్నది మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. భగవంతుడిని తెలుసుకోవటానికి మనం పూజలు, జపాలు. ధ్యానాలు చేస్తూఉంటే మనకు నిజం తెలియకపోయినా, ఆయనకు నిజం తెలుసు కాబట్టి, నిజం దగ్గరకు మనలను తీసుకొని వెళ్ళటానికి ఆయనే గురురూపంలో వచ్చి ఏజన్మకు ఆజన్మ మనకు గైడెన్స్ ఇస్తాడు. నువ్వుకాని విషయాల గురించి ఆలోచించకు, మనస్సును వాటి మీదకు వెళ్ళనీయకుండా దానిని లోపలకు మళ్ళించు. దానికి అభ్యాసం, వైరాగ్యం అవసరం.

మన దైనందినజీవితంలో సాధ్యమైనంతవరకు అహంభావన కలుగజేసుకోకుండా చూసుకోవాలి. మన మాట, చేత, తలంపులు అహంభావపూరితంగా ఉండకూడదు. ఇప్పడు మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో దానిని ఒక ప్రక్కనపెట్టి మనం జీవిస్తూ ఉంటే, ఈ జన్మలోనే ఇప్పడే ఇక్కడే లోపలఉన్న సద్వస్తువు మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మనకు ఆత్మబుద్ధిలేదు, మనకు ఉన్నది సంసారబుద్ధి, ఈ సంసారబుద్ధి నశించాలి అప్పడుగాని మనం జననమరణ ప్రవాహంలో నుండి విడుదలపొందలేము. లోపల సంసారబుద్ధి పెట్టుకొన్నవాడికి మోక్షం ఎలా వస్తుంది, సంసారబుద్ధి ఉన్నవాడు శవాలను మోస్తూ ఉండవలసిందే. ఓ లక్ష్మీనరసింహస్వామీ! నన్ను సంసారం అనేమొసలి పట్టుకొంది, అందులో నుండి విడుదలపొందలేకపోతున్నాను. దానికోసం నేను చేసే ప్రయత్నానికి సహాయసహకారములు అందించి ఈసంసారం అనే మొసలిలో నుండి నన్ను బయటపడేయ్యి అని నరశింహస్వామిస్తోత్రంలో ఆచార్యులవారు నరశింహస్వామిని ప్రార్థించారు. మనం ఈ భూమిమీదకు వచ్చినది మొదలు మరల స్మశానంకు వెళ్ళేవరకు కొంతమందిమీద ఇష్టం, కొంతమందిమీద అయిష్టం మనస్సు ఇలా ఇష్టాలు, అయిష్టాల మధ్య తిరుగుతూ, సాధనచేయుటం మానివేసి, నామరూపములను పట్టుకొని, కర్మనుపోగుచేసుకొంటూ భవసాగరంలో కొట్టుకొనిపోతోంది, ఇలా వేలాదిజన్మలు వెళ్ళిపోతున్నాయి. మనకు ఉన్నధనం సంపదకాదు, వినయమే నిజమైనసంపద. మనకువినయం లేకుండా మాకు వినయం ఉంది అని మనం అనుకొంటే సరిపోదు, ఆవిధంగా మనం ఈశ్వరుడిని మోసంచేయలేము. మనకు ఉన్న అధికారాన్ని బట్టిగాని, ధనాన్నిబట్టిగాని, చదువునుబట్టిగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. బాహ్యప్రక్రియల వలన ఇంతవరకు ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగలేదు. మీ ఊరిలోని వారికి ఎవరికి మీ అడ్రసు తెలియదు అనుకోండి, మీరు ఈశ్వరుడిని తెలుసుకోవటానికి సాధనచేస్తున్నారు అనుకోండి ఈశ్వరుడు తెలియబడతాడు. దేవుని దయ వలన దేవుడు తెలియబడతాడు కాని బాహ్య ప్రక్రియల వలన ఆయన తెలియబడడు. మీకు విచారణామార్గం నచ్చకపోతే ఈశ్వరుడిని నిరంతరం స్మరించండి. నిరంతరం భగవంతుడిని స్మరించటం వలన, ఆయనను ధ్యానించటం వలన మన నామరూపాలకు దూరమవుతాము. మీరూపం మీరుకాదు, మీ నామం మీరుకాదు. మీరుకానిదానిమీద ఇష్టం పెంచుకొంటూఉంటే మీకు నిజం ఎలా తెలుస్తుంది అంటున్నారు భగవాన్. నిరంతరం దైవాన్ని స్మరించటం వలన, ఆయనకోసం తపించటంవలన మనలోని కోరికలు, వాసనలు రాలిపోతాయి. ఈ వాసన నన్ను చాలా బాధపెడుతోంది దానిని ఎలా తొలగించుకోవాలి అని మనం అనుకొంటున్నాము. ఈ వాసనే మంచిదని పూర్వజన్మలో దానిని పోషించుకొన్నాము అది చెడ్డదని ఇవాళ మనకు తెలుస్తోంది. ఆవాసన నుండి విడుదలపొందేటప్పడు కొంత బాధ ఉంటుంది. ఆ బాధలను సహించుకొంటే వాసనారహితస్థితిని పొందవచ్చును.

ఆత్మజ్ఞానం గురించి శ్రవణంచేయటం వలన దాని ప్రాముఖ్యత మనకు తెలుస్తుంది. దాని ప్రాముఖ్యత తెలిస్తే అది నేర్చుకోవాలనే బుద్ధి కలుగుతుంది. ఎన్నోజన్మలనుండి బాహ్యంగా సంచారం చేయటం మనస్సుకు అలవాటు అయిపోయింది. విషయచింతనలోనుండి భగవంతుని వైపుకు మనస్సును మళ్ళించటం ప్రధమంలో నీకు బాధాకరంగా ఉంటుంది, అలవాటు అయిపోతే ఏమీ బాధ అనిపించదు. అందుచేత భగవంతుడితో సంబంధం పెట్టుకో, భక్తులతో సహవాసం చెయ్యి. మీరు ధనాన్ని ఎలాగ కాపాడుకొంటున్నారో, ఆరోగ్యాన్ని ఎలాగ కాపాడుకొంటున్నారో అలాగ భగవంతుడితోటి, సత్పురుషులతోటి అనుబంధాన్ని కాపాడుకోండి, అలా కాపాడుకోవటం వలన మనలోఉన్న దుమ్ముఅంతా, చెడ్డ అంతా రాలిపోతుంది. అస్తమానూ చెడ్డవంక చూడకండి, మీరు ఏదైతే పోగొట్టుకోవాలనుకొంటున్నారో అస్తమానూ దానివంక చూడకండి. భగవంతుడి వైపు చూడండి, మంచి వైపుకి చూడండి. మీరు మంచిని పెంచుకొంటూ ఉంటే చెడ్డ దానంతట అదే రాలిపోతుంది. ఈ సంసారం అనే రోగంపోవటానికి, అజ్ఞానం పోవటానికి భగవంతుడిని స్మరించటంకంటే, భగవంతుడితో అనుబంధం కంటే మంచి మందు లేనేలేదయ్యా, దీనివలన శారీరకరోగాలు పోతాయి, మానసికరోగాలుపోతాయి, బుద్ధిలోఉన్నదోషాలుపోతాయి, ముఖ్యంగా రాబోయేజన్మలకు కారణాలు అన్నీపోతాయి. భగవంతుడితో అనుబంధం పెట్టుకొంటే సరిపోదు, దానిని నీచివరిశ్వాసవరకు నిలబెట్టుకోవాలి, అనేక ప్రతిబంధకాలు వచ్చినా తట్టుకొని నిలబెట్టుకోవాలి. శ్రీ కృష్ణచైతన్యకు ఒక ముస్లింభక్తుడు ఉండేవాడు శ్రీ కృష్ణచైతన్య ఆ భక్తుడితో నువ్వు ఏదైనా కోరుకో నేను నెరవేరుస్తాను అన్నాడు. నాకు ఏమీ కోరికలేదు నువ్వులేని ఈ ప్రపంచాన్ని నేను చూడలేను, నువ్వు లేని ఈ ప్రపంచం నాకు అక్కరలేదు. నాకు కోరిక అంటూ ఏదైనా ఉంటే నువ్వు బతికి ఉండగానే నేనుపోవాలి

అన్నాడు. శ్రీకృష్ణచైతన్య ఆ కోరికను నెరవేర్చాడు, ఆయన ఒడిలోనే ఆ ముస్లింభక్తుడి ప్రాణంపోయింది.

నాకు ఏదైనా కోరిక వచ్చింది అనుకోండి దానిని నెరవేర్చుకోమంటారా? ఆపుచేసుకోమంటారా? అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నువ్వు ఒక కోరిక నెరవేర్చుకొన్నావు అనుకో, అది అంతటితో ఆగదు ఇంకో పది కోరికలను తీసుకొని వస్తుంది. కోరికను నెరవేర్చుకోవటం కంటే కోరికను కంట్రోలు చేసుకోవటంలో ఎక్కువ సుఖపడతావు. మనస్సు కంట్రోలులో ఉంటే నీకు ఎక్కువ శాంతికలుగుతుంది. నిప్పులో నెయ్యి వేస్తూనిప్పను ఆర్పాలి అనుకోవటం ఎటువంటిదో నువ్వుకోరికలను నెరవేర్చుకొంటూ కోరికలలోనుండి బయటపడాలి అనుకోవటం కూడా అటువంటిదే. నీకు కోరిక వచ్చింది అనుకో, ఈ కోరిక ఎవరికి వచ్చింది అని ప్రశ్నించుకో, నాకు వచ్చింది. ఈ నేను అనేది ఒకతలంపు, కోరిక అనేది ఒకతలంపు. కోరిక వచ్చే ఈ నేను ఎవరు అని ప్రశ్నించు? అప్పుడు అది లోపలకు ఉపసంహరింపబడుతుంది, అప్పుడు దానికి వచ్చే ఇతరతలంపులు అన్నీ ఆగిపోతాయి. బాధ్యతలేని మాటలు మాట్లాడకూడదు, బాధ్యతలేని పనులు చేయకూడదు. పిచ్చిపిచ్చి ఆలోచనలు రాకుండా చూసుకోవాలి, మనకు వచ్చే ఆలోచనలకు బాధ్యతవహించాలి. బాధ్యతలేనిమాట, బాధ్యతలేనిజీవితం, బాధ్యతలేని ఆలోచనల వలన మనకు అజ్ఞానం పెరుగుతుంది. నిరంతరం ఈశ్వరుడిని స్మరించటం వలన పాతవాసనలుపోతాయి, కొత్తవాసనలు రావు. మనకు ఇష్టమైన పనిచేయటం గొప్పకాదు. మనకు ఇష్టం ఉన్నాలేకపోయినా భగవంతుడికి ఏది ఇష్టమో ఆపనులు చేస్తూ, భగవంతుడి ఇష్టానికి అనుగుణంగా మనం జీవిస్తూ ఉంటే ఈ జన్మలోనే మనకు మోక్షాన్ని ఇస్తాడు. మన బుద్ధిలో దోషాలు ఉన్నాయి అనుకోండి, మనం ఆయన చెప్పినట్లు జీవిస్తున్నాము అనుకోండి, నీ బుద్ధిలో దోషాలు ఉన్నాయనే నెపంపెట్టడు, మన బుద్ధిలో ఉన్న దోషాల నుండి విడుదలచేసి, మనలను పవిత్రంచేసి, ఆయన అనుగ్రహాన్ని మన మీద వర్షింపచేసి, ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. నాకు పురోగతి ఎప్పుడు వస్తుంది అని భగవాన్‌ను అడిగితే నీకు వ్యర్థమైన ఆలోచనలు, వ్యర్థమైన తలంపులు వస్తూఉంటే అది నీ తిరోగతికి నిదర్శనం. వ్యర్థమైన ఆలోచనలు, వ్యర్థమైన తలంపులు లేకుండా నీ ఇష్టదైవం మీద నీ మనస్సు నిలబడుతూఉంటే అది నీపురోగతికి నిదర్శనం. కలియుగంలో నామాన్ని స్మరించటం వలన నీ బుద్ధిలో ఉన్న దోషాలుపోతాయి, నీవు పరిశుద్ధుడవు అవుతావు, ఆత్మజ్ఞానానికి ఫిట్ అవుతావు అని బ్రహ్మదేవుడు చెప్పాడు. నీ హృదయంలో ఉన్న చైతన్యం రూపరహితం, నామరహితం, నీవు ఏదో ఒక అవతారపురుషుని రూపాన్ని, నామాన్ని పట్టుకొని ఆరూపం ద్వారా, నామంద్వారా నీవు రూపరహితస్థితిని, నామరహితస్థితినిపొందాలి, అదే జీవిత గమ్యం, దానికే సాధన.



## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 12-02-04, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గాఢనిద్రలో మనం లాభనష్టాలకు, పుణ్యపాపాలకు, జయాపజయాలకు వీటిఅన్నింటికి అతీతంగా ఉన్నాము అని మనకు తెలుస్తోంది, కాని నీవు దానిని అందుకోలేక కానిదానితో తాదాత్మ్యం పొందటం మరణించటం. జన్మించటం ఇలా జననమరణచక్రంలో తిరుగుతున్నాము. సత్యము నిత్యము కానిదానితో తాదాత్మ్యంపొంది దానిని సాధించినా దానివలన ప్రయోజనం ఏమిటి? నువ్వు జీవించి ఉండగా అదిఅన్నా పోతుంది, అదిఉండగా నీవుఅన్నా పోతావు. అసలు శరీరంతోనే విడిపోవాలికదా ఇతరవిషయాల గొడవ ఎందుకు. నీకు దేహం ఉంది, దేహం ఉంటే పొట్ట ఉంటుంది. పొట్ట ఉంటే ఏదో తినాలి కదా. నీ పని ఏదో నీవు చేసుకొంటూ, నీ దేహాన్ని పోషించుకొంటూ, మిగతాటైమంతా భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకో అంటున్నారు భగవాన్. కర్తృరాజ్ఞియాలో కర్త అంటే ఈశ్వరుడు, జీవుడుకాదు. ఆయన ఆజ్ఞననుసరించి ఈ సృష్టిలో ప్రతీ చిన్నవిషయం జరగవలసిందే. కర్త మాత్రమే స్వతంత్రుడు, జీవుడు స్వతంత్రుడుకాదు. ఆ కర్తయొక్క స్వరూపం పొందితేనే మోక్షం, అదే చిటారుకొమ్మ. ఏతలంపు అయితే దేహంతో తాదాత్మ్యం పొందుతోందో అదే అవిద్య, అదే బంధం, అదే సర్వఅనర్థాలకు కారణం. అది తెగేవరకు ఈ జననమరణప్రవాహము నుండి బయటకురాలేము. సాధన ఎలా ఉండాలంటే మీకు ఇష్టమైన పదార్థం తినేటప్పుడు ఎంత ఆనందంగా తింటారో, సాధనలో కూడా అంత ఆనందం ఉండాలి. అలాగయితేనే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీరు చేసే సాధనలో ఇష్టం కనిపిస్తోందా? ప్రేమ కనిపిస్తోందా? ప్రీతికనిపిస్తోందా? ఇవి ఏమీ కనిపించటంలేదు, ఏదో యాంత్రికంగా చేస్తున్నారు. మీరు యాంత్రికంగా చేస్తున్నట్లు భగవంతుడికి తెలుస్తుంది. యాంత్రికంగాచేస్తూ ఉంటే ఆయన స్వరూపాన్ని మీకు ఇవ్వడు.

మనకు భగవంతుడి మీదనమ్మకంలేదు, భగవంతుడి మాట మీద ప్రమాణబుద్ధి లేదు. మనం ఆత్మకి భక్తులంకాదు, జ్ఞానానికి భక్తులంకాదు. మనం కాళ్లకు చెప్పేపని, చేతులకు చెప్పేపని బుద్ధికి చెప్పటంలేదు. మరి మనకు తలకాయ ఎందుకు ఇచ్చాడు. వేదాంతం చదవటం మన బుద్ధిని పోగొట్టుకోవటానికి కాదు, మనకు ఉన్న తెలివిని ఊడగొట్టుకోవటానికి కాదు, మన తెలివిని వివేకాన్ని పెంచుకోవాలి. మీరు మాటల విషయంలో, తిండివిషయంలో, ఆలోచన విషయంలో జాగ్రత్తగా ఉండండి. మంచిని పెంచుకోండి, మీకు మీరు ఉపకారం చేసుకోండి, కుటుంబానికి ఉపకారం చేయండి, సమాజానికి ఉపకారం చేయండి. మీ శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకొని, సాధన చేసి ఎప్పుడూ నిత్యంగా ఉండే వస్తువును పొందితే మీరు తరిస్తారు. శరీరం చావకుండా ఉండటం అసాధ్యం, ఆత్మ చనిపోవటం అసాధ్యం, మనం ఆత్మను వదిలేసి

చనిపోయే శరీరాన్ని పట్టుకొంటున్నాము. మనం ఎవరినైనా చూసి అసూయపడితే వారు పాడైపోరు, వారు అభివృద్ధిలోనికి వస్తారు, పైగా మనకు ఇంకోనష్టం మనలో ఏదైనా పుణ్యం ఉంటే భగవంతుడువారికి ఇచ్చేస్తాడు. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఈ సంఘటన ఇలా జరిగింది ఏమిటి అని ఇప్పడు నీకు అనిపించినా ఇది నీ బాగుకోసమే చేసాడని పరిణామంలో నీకు తెలుస్తుంది. ఏ తలంపు అయితే నీకు నేనుగా వ్యక్తమవుతోందో అదే దెయ్యం, దానిలో నుండి విడుదలపొందితే నీ హృదయంలో ఉన్న వస్తువు ఎరుకలోనికి వస్తుంది నువ్వు బాగుపడటానికి ప్రయత్నం చేయకుండా, ఎవరోవచ్చి బాగుచేస్తారని ఎదురుచూడటం, ఇలా చూడటంలోనే శరీరం చనిపోతుంది, ఇంక అప్పడు నీకు సాధించేది ఏమిటి? మనలను మనం బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేస్తూఉంటే, కృషేకృప కిందమారుతుంది. కాళ్ళు ఉంటే నడవలేరు కళ్ళుకూడా ఉండాలి అన్నాడు ఐన్‌స్టీన్ గుడ్డివాడు అనుకోండి, నడిచి వెళ్ళిపోతే ఏ కాలువలోనో పడిపోతాడు. అలాగే నీకు ఎన్నిఉన్నప్పటికి జ్ఞానినేత్రం లేనప్పడు ప్రమాదంలో పడతావు ఆలోచనలేని సాధనలు, మీరు ఏమిచేస్తున్నారో దానితాలుక ఎరుక మీకు లేనప్పడు గుడ్డివాడు నడుస్తున్నట్లుగానే ఉంటుంది. నడవటానికి కాళ్ళు ఎంత ముఖ్యమో కళ్ళు కూడా అంతే ముఖ్యం అన్న సంగతి మీకు తెలియటం లేదు.

హృదయంలో ఎప్పడైనా కొన్ని క్షణాలు ఉండగలుగుతున్నాను, ఎక్కువసేపు ఉండలేకపోతున్నాను అని ఒకరు భగవాన్‌తో అంటే అభ్యాసం వలన, వైరాగ్యం వలన ఎక్కువ సేపు ఉండగలవు అని భగవాన్ చెప్పారు. నీకు వైరాగ్యం ఉంటే మనస్సు ఎక్కువగా విజృంభించదు. వైరాగ్యంలేకుండా ఆత్మజ్ఞానంరాదు. వైరాగ్యంలేనివాడిని ఇతరులు పీడించనక్కరలేదు, వాడిచేత వాడే పీడింపబడతాడు. మీకు నేను ఎలా బోదిస్తున్నానో అలాగ మీ మనస్సుకు మీరు బోధించుకోండి. మనస్సును దాని పుట్టుస్థానమైన హృదయంలో ఎక్కువగా నిలబెట్టి ఉంచటం వలన మనస్సు నశిస్తుంది. మనస్సు నశిస్తే నీవు నశించవు, మనస్సుకు ఆధారంగా ఉన్న చైతన్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. అయితే అభ్యాసం ఎక్కువగా చెయ్యాలి. జపం, ధ్యానం, విచారణ చేయండి. వీటివలన జ్ఞానినేత్రం వస్తుంది. ఇప్పడు మనకు ఉన్న ఈ భౌతికనేత్రాలతో ప్రపంచంలోని వస్తువులను ఎలాచూస్తున్నామో అలాగ నీకు జ్ఞాననేత్రం వచ్చినప్పడు హృదయంలో ఉన్న వస్తువు నీకు స్పష్టంగా గోచరిస్తుంది. అప్పడు ఏది నిత్యం, ఏది అనిత్యం, ఏది సత్యం ఏది అసత్యం అనేది నీకు స్పష్టంగా తెలుస్తుంది. నీ మనస్సు నిర్మలం అవ్వాలంటే, నీ మనస్సుకు సుఖం కలగాలంటే నీవు అభ్యాసం చేసి అది ఎక్కడైతే ఉదయించిందో అక్కడకు నీ మనస్సును ఉపసంహరించు, అప్పడు నీకు శాంతి కలుగుతుంది, సుఖంకలుగుతుంది. ఇప్పటి వరకు దుఃఖంలో ఉన్నాము, ఏమిటి ఇంత శాంతి వచ్చేసింది అని మిమ్మల్ని చూసిమీకే ఆశ్చర్యంకలుగుతుంది అంటున్నారు భగవాన్. మనస్సు హృదయాభిముఖంగా

**5-08-2004**

ప్రయాణంచేస్తూఉంటే, దాని తాలుక రుచి మనస్సుకు కొంత తెలిసినప్పడు ఇంక నీ ప్రయత్నం అవసరం లేకుండానే అది గంతులు వేసుకొంటూ వెళ్ళి హృదయంలో ఐక్యమయిపోతుంది అంటున్నారు భగవాన్. మీరు మనస్సును హృదయం వైపుకు మళ్ళించమంటున్నారు, మాటలు బాగానే చెపుతున్నారు కాని యాక్షన్‌లోనికి వచ్చేటప్పటకి చాలా కష్టంగా ఉంది అని అంటే నువ్వుకంగారుపడకు, నెమ్మదిగా అభ్యాసం చెయ్యిఅంటున్నారు భగవాన్, ఏకారణాల వలన నీ మనస్సు బాహ్యాముఖానికి వెళుతోందో అవి అన్నీ వేరుతో సహా నశిస్తే గాని నీకు జ్ఞానం నిలబడదు, ఒకవేళ మధ్యలో నీకు శాంతి వచ్చినా అది నిలబడదు. నీ సాధనకు వయస్సు తక్కువ, వాసన యొక్క వయస్సు ఎక్కువ, దాని బలం ఎక్కువ, వాసన వేరుతో సహా నశించాలంటే స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరుని కటాక్షం అవసరం.

నీకు ఇష్టాలు, అయిష్టాలు తగ్గుతున్నాయిఅనుకో, నీకు తలంపులు, చిరాకులు తగ్గుతున్నాయి అనుకో, నిన్ను ద్వేషించేవాడిని చూచిన వాడిమీద ద్వేషం కలుగకుండా ప్రేమే కలుగుతోంది అనుకో అప్పడు నీ మనస్సు ఆత్మజ్ఞానం పొందటానికి సమాయత్తం అవుతోంది అని అర్ధం. నీకు ఎన్ని తలంపులు వస్తే రానియ్యి, ఆతలంపులకూడా పరిగెట్టవద్దు. ఈతలంపు ఎవరికి వస్తోంది అని ప్రశ్నించుకో, నాకు వచ్చింది అనుకొంటావు. ఇవిఅన్నీ ఏనేనుకు వస్తున్నాయో దానిని ప్రశ్నించు, దానిని విచారణచెయ్యి, అప్పడు అది దానిపుట్టుస్థానమైన హృదయంలోనికి ఉపసంహరింపబడుతుంది. నీకు నేను ఉంటే ఇతర తలంపులు ఉన్నాయి, ఈ మూలతలంపు లేనప్పడు ఇతరతలంపులు లేవు. మీకు జ్ఞానోదయం అయిన తరువాత పగటి చంద్రుడికి ఎంత విలువ ఉంటుందో, నీ మనస్సుకు కూడా అంతే విలువ ఉంటుంది. మన విషయాలు చక్కదిద్దుకోవటానికే చాలా టైము అయిపోతుంది, మిగిలిన కాలంలో భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేయటం మానివేసి ఇతరుల గొడవలలో కలుగజేసుకోవటం, వ్యాపకాలు పెంచుకోవటం దీనివలన కాలం వృధాఅవుతుంది, పోయిన కాలం తిరిగిరాదు ఇది గుర్తుపెట్టుకోండి. వర్తమానకాలంలో జీవించు, జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన నీకు దుఃఖం మిగులుతుంది. మనం ఫలితం గురించి ఆలోచించకుండా, మన చేతిలో ఉన్నపని మీద మనస్సును అక్కడపెట్టి చేస్తూ ఉంటే అదియోగంతో సమానము. మనం పూజగదిలో ఉన్నంతసేపు అది ఆధ్యాత్మికజీవితం అని, పూజగది నుండి బయటకు వచ్చిన తరువాత దానికి విడాకులు ఇచ్చేయటం కాదు. మీ భౌతికజీవితాన్ని కూడా ఆధ్యాత్మికజీవితం అభివృద్ధిపొందటానికి ఉపయోగించుకోండి, అక్కడే మీ తెలివి అవసరం. మీరు ఏదైతే పొందాలో దానికోసం మీ జీవితాన్ని తీర్చిదిద్దుకోండి, మీరు వినండి వినటమే పనికాదు, మీరు వ్రాయండి వ్రాయటమే పనికాదు, మీరు నడవండి నడవటమే పనికాదు. వీటి ద్వారా మీరుపొందవలసిన వస్తువు వేరే ఉంది. దానిని మిస్ అవ్వవద్దు, దానిని పొందటానికి వీటిని ఉపయోగించుకోండి, దానిని పొందటానికి అనుగుణంగా జీవించండి.

**రమణ భాస్కర**

